విద్యా విధానం!

శ్రీ పులుగుండ్ల రామకృష్ణయ్య

టంగ్, టంగ్, టంగ్ మని ఊళ్ళో బడిగంట వినబడ్తూంది. ఆ బడి రామాపురం ఊరి గమిళ్ళో ఉంది. పేదవాళ్ళ బిడ్డల చదువుకోసం ఏర్పాటయిన దిది.

ఆ బడికొచ్చి చదువుకొనే బిడ్డల గతి స్థితి ఎలా వుందో, అలాగే ఉంది ఆ బడి స్థితి కూడాను. తైల సంస్కారం లేక ఆ బిడ్డల జుట్టు ఎలా రేగిపోయి చిర్రపారి రొటుకు దిటుకుగా ఉందో, అలాగే ఆ స్కూలు పైకప్పు కొంత గాలికి ఎగిరిపోయి, కొంత చెదలుతిని అవకతవకగా ఉండటమే కాక, చుట్టూ అడ్డగించిన దడి కూడ ఆ బిడ్డల ఒంటిమీద గుడ్డల్లాగే, చినిగి పీలికలు పాలికలై, అతుకులు బొతుకుల్తో పిల్లల ఒంటికి ఆచ్ఛాదనగా ఉన్నట్లే, ఆ బడికి నిమిత్తమాత్రం అడ్డగింపు. గర్భదరిద్రులబిడ్డలు ఊళ్ళో ఎండన, గాలిన అడుక్కొని తినటం మూలాన చెమటపట్టి, శరీరం ఆపాదమస్తకం, మట్టి చారల్తో ఉప్పు పేలిపోయినట్లే, ఆ బడి గోడలు వానకు తడిసి చారలుపడి, ఉప్పుగాసి పోయి కనుపట్టడమేగాక విద్యార్థులనుంచి వచ్చే దుర్గంధం బడినుంచి వెలుపలికి కొడ్తూంది.

ఈ బిడ్డలు ఊళ్ళో కవళం అడుక్కొని తింటూ బ్రతుకుతూంటే, వీళ్ళగురువు తనబిడ్డలు టౌనులో హైస్కూల్లో చదువుకొంటున్నారని, కూతుళ్ళు ఎదిగి పెళ్ళికి సిద్ధంగా ఉన్నారని. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలని యోచిస్తాడు. అంతే. కాని వాళ్ళకు వీళ్ళకు ఉండే తేడా ఏమిటంటే బడిపంతుళ్ళ చేతుల్లో మూకుళ్ళుండవు. బడిపంతుళ్ళ ఆకారం, వస్త్రధారణ, ఉనికంతా పగటి వేషాలవారికి నమూనాలుగ ఉంటాయి.

ఆ గ్రామంలో రాగయ్య ఓ పెద్ద ఆసామి శంకరయ్యగారి కమతం సేద్యగాడు. ఇతడికి పదిమందిబిడ్డలు. వీరిలో ముగ్గురు నలుగురు ఆస్కూల్లోనే చదువుకొంటున్నారు. తతిమ్మావారు అర్భకులు-కూనా గురుజుబిడ్డలు. శంకరయ్య ఆ గ్రామపంచాయతి ప్రసిడెంటుకూడ— గ్రామంలో పార్టీపట్టుదలకోసం ప్రసిడెంటయ్యాడు. పంచాయతీ పరిపాలన, మంచిసెబ్బర్లు, ఈ పార్టీల గొడవల్లో పట్టించుకొనే ఎరుగడు అని వినికిడి.

తరాలుగ ఈ రాగయ్య కుటుంబీకులు ఈ శంకరయ్య కమతంలో సేద్యగాళ్ళు. సుబ్బయ్య-రాగయ్య తండ్రి ఇరవయ్యయిదేండ్లు సేద్యగాడుగ గడిపాడు. పెన్షన్కుబదులు ఇన్నేళ్ళు కామందుకు కష్టంచేసి మిగిల్చుకొన్నది అరిగిన ఎముకలు, కరిగిన కండలు, ముడతలుపడ్డ శరీరం, బరువులు బండలు మోసి మోసి కాయకాచిన బట్టతల. కూడా బుట్టిన దోషానికి తలను కనిపెట్టుకొని ఉన్న వెంట్రుకలను చూస్తూంటే బ్రతికిచెడిన సంసారంలోని హంగుసంగులు వలె ఉండీ లేనట్లు కనబడుతున్నాయి. ఎవరో ఈ వృద్ధుణ్ణి ఎరిగిన ఆయన హెచ్చరించుకొని "ఏం సుబ్బయ్యా! కళ్లు చెవులు రెండూ పోయినాయే?" అన్నాడు.

"అయ్యా మావాళ్ళ. కష్టాలు చూళ్ళేక కళ్ళు, వినలేక చెవులు రెండు పోయినాయి. అలవాటు పడ్డ మమకారం కొద్ది ఒకళ్ల ప్రాణాలు ఒకరిమీద పడి కొట్టకలాడ్తుండాయి" అన్నాడు డగ్గుత్తికతో!

ఈ సుబ్బయ్య హయాంలోనే వీళ్ళకుటుంబానికి స్వంతసేద్యం ఉణ్ణింది. కాలం కలసిరాక కొంత, కుటుంబాన్ని పోషించలేక ఋణ బాధలకు కొంత విచ్ఛిన్నమై నష్టపడిపోయి, మిగిలిన ఆ రవంత కయ్య కాల్వ ఈ శంకరయ్యకే విక్రయించి సేద్యగాడైనాడు. ఇప్పుడా భూమినే సుబ్బయ్య కొడుకు యకరాకు రెండేసిపుట్లు పండించి శంకరయ్యకు కూటు కడ్తున్నాడు. రైతు పేదయితే భూమికూడ పేదవంటారు.

కొన్నాళ్ళు రాగయ్య కుటుంబీకులు భూకామందులు, సొంత సేద్యగాళ్ళు. తర్వాత పాలిగాళ్ళు, ఆ తర్వాత కూలివాళ్ళు, ఇప్పుడు బిచ్చగాళ్ళు.

రాగయ్యకు ఆరు నెలల క్రితం పక్షవాతం తగిలింది; మూలపడ్డాడు. ఈ వ్యాధిగ్రస్తుడు కాటానికి ముందు పూట గడవనినాడూ, ఇంట్లో పురుళ్లు పుణ్యాలకు, అదనంగా అప్పుడప్పుడూ, తన కామందు శంకరయ్య దగ్గర పట్టుబళ్లు పట్టాడు. ఈ పట్టుబళ్ళకంతా నాములు కట్టి, పుట్టి నాలుగువందల లెక్కకు ఖరీదు

కట్టి రు 150/-లకు రాగయ్యచేత 1-8 0 వడ్డీ లెక్కను బాకీకి ప్రోనోటు వ్రాయించుకొన్నాడు. రాగయ్యకు రావలసిన పెట్టుబడి సాలాఖరు వరకు చేస్తేనే కద్దు, లేకుంటే లేదు. రాగయ్య సాలాఖరు కాకముందే రోగాన పడ్డందున శంకరయ్య బాకీ వర్తించదు.

ఇక భార్య ఉంటే బాలింతగ చూలింతగ కొన్నాళ్లు సేద్యంపనులు జరగని కాలంలో పస్తులన్నా ఉండాలి, లేక కవళం అన్నా తెచ్చుకోవాలి. ఇన్నాళ్లన్నా పాలసీ ప్రిమియం చెల్లించన్నాడు లాప్సయినట్టు, రాగయ్య రోగాన పడ్డనాడే జీతం బిగిసిపోయింది. కీళ్ళు తొలగి ఎముకలు విరిగేటట్టు పని చేసిన్నాడే అందుతులు;—మరి ఇప్పుడు అప్పుభారం కూడా. ఈ పరిస్థితుల్లో రాగయ్యకు చావుకంటె బ్రతకటవే భయంగా ఉంది. రోగం కుదుర్చుకోవాలని కంచం, చెంబు, చెరవతో కూడ అమ్ముకొన్నాడు. ఏం లాభం లేకపోవటవే గాక, ఇంటా ఒంటా బలం తగ్గేకొద్దీ రోగానికి బలం హెచ్చి మృత్యుదేవతకు అండయింది. భార్యాభర్తలు ఉభయులు ఆర్జించే రోజుల్లోనే కూటికి అరదట్లయితే ఇప్పుడు పస్తే గతయింది. ఇప్పుడు ఒక్క రాగయ్య భార్య నరసమ్మే ఇంటికి ఆధారమయింది.

ముసలివాడు; రాగయ్య తండ్రి సుబ్బయ్య— తన కడుపుకు తాను కవళం తెచ్చుకొని, మిగిల్చి పిల్లలకు పెడుతున్నాడు. కూటికే ఇట్టుంటే ఇక గుడ్డగతి! ఆకాశం గుప్పటే అంచుకూ పంచుకొని కప్పుకుంటున్నారు. ప్రాణానికి కూడు లేదు, మానానికి గుడ్డ లేదు. రాగయ్య సంపాదించే రోజుల్లో ఒకపూట పస్తున్నా ఇంకో పూటైనా తిని బడి కెళ్ళి చదువుకొనేవాళ్ళు బిడ్డలు. ఇప్పుడు నాయన మూలపడ్డనాట్నుంచి పిల్లలే పెద్దలై సంసారాన్ని నెగ్గిస్తున్నారు. ఈ గతుల్లో వీళ్ళకు శారీరకంగా, మానసికంగా కూడ వృద్ధాప్యం తరుముకొని వస్తూంది. ఈ పరిస్థితుల్లో ఒకపూట బడికిపోతే ఇంకోపూట వాగా! ఇంత వ్యతిరేక పరిస్థితుల్లోకూడ పిల్లలు ఎంతో శ్రద్ధగా వెనుకపడ్డ పాఠాల్ని చదివి తోటి పిల్లంతోటి కలుసుకొంటున్నారు.

తరతరాలుగ ఎండన గాలిన అల్లాడి ఆకులు మేసి గుండెల్ను మురగకొట్టుకొని మిగిల్చింది ఏమీ లేదని, కానీ బిడ్డలైన చదువుకొని వాళ్ళ హయాంలోనైనా నీడపట్టునవుండి, కొత్త వైనవైన బ్రతుకు బ్రతుకుతారని తల్లిదండ్రులకు కొండంత ఆశ. పాపం! మరి అవకాశం ఆకాశమంతదూరం; అందుబాటు శూన్యం. దరిద్రుడు తలగడిగితే వడగళ్ళవాన వచ్చినట్టయింది.

బళ్ళో మళ్ళీ రెండోగంట కొట్టారు. ముందు రోజు కవళానికి పోయినందువల్ల పిల్లలు బడికి పోలేదు. జరిగినపాఠాలు వల్లెవేస్తున్నారు. ఊళ్ళో పిల్లలంతా బడికి బయలుదేరారు. కలవారిబిడ్డలు, తలలు దువ్వుకొని పూలు పెట్టుకొని మంచిగుడ్డలు కట్టుకొని ఉత్సవ విగ్రహాల్లాగా కళకళలాడుతు వస్తుంటె, రాగయ్య బిడ్డలాంటివాళ్ళు తాల్చుకోపోయిన తలల్తో, మాసిపోయిన గుడ్డల్తో వస్తూంటె దేవాలయంలో పూజ, పులికాపు అలంకరణలేని విగ్రహాల్లా కనుపడుతున్నారు, రాగయ్యబిడ్డలు బడికిపోవటానికి సిద్ధమయ్యారు.

ఇంతలో వాళ్ల తల్లినరసమ్మ వస్తూండటం ఓ అమ్మాయి చూచింది.

"అమ్మేయ్! అమ్మ వస్తుందదే యిట్టా? కవళానికి పొమ్మంటె బడికిపోతుండామని అరస్తదే! ఏం చెప్పనమ్మే!"

"అమ్మతో చెప్పి పోదాం లే! అమ్మ కూలిగింజల్నాయియ్యాల దంచి కొస్తది లే, చాలకుంటె బడి నుంచివచ్చి కవళానికి పోదాంలె" అని ఇంకో అమ్మాయి అనింది.

"ఇవకుండా పెత్రదం జేస్తే యట్టా?"

"అప్పుడు జూస్తాంలె. అరబాక అమ్మేయ్! అమ్మ ఇంటది!" అని తలపోసుకొంటున్నారు.

ఇంతలో నరసమ్మ వచ్చింది. ఈమెకు ఎవరో కూలిగింజలు ఇయ్యాల్నుండి అడగనుబోతే, వాళ్లు లెక్కచూచి, ఇంకా నరసమ్మ, ఇద్దరు మనుష్యులు అదనంగా పని చెయ్యాల్సినట్టు, కూలిబాకీ పడినట్టు, బాకీ చెల్లుపెట్టందే, ఇంక గింజకూడ కంటికి చూపమని అసామి అంటె, ఆమాట చెవున వేసికొని కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చింది. పిల్లలవాలకం చూసింది.

"ఇకేంది కూతరా! ఈ ఊరేగింపులు? బడికొచ్చిందా తొందరా? చెప్పింది దొంగలకు దోలి ఈ రకానికి తిరుక్కున్నారే? ఇదేం దిది? ఈ శానేతనం? ఊళ్లో కవళానికి పొమ్మంటె ఈ వంతన సంబరాలు పడ్తుండారే! ఇయ్యాల పస్తుంటారా? కూనగుజుజు నకనక లాడ్తుంటె కనబళ్లా? పొట్ట జూడండి యాడికొచ్చిందో? ఇంక మీరు తెల్లార్చి దెబ్బడో చెప్పండి!"

"ఈపూట నీ కూలిగింజలు దంచి వాళ్ళకోని పూట ఎల్ల దోసుకొంటె సందాల కవళానికి పోతాంలె" అన్నారు పిల్లలు.

"అయ్యేప్పుడో ముగించి మొఖం కడిగినార్లే-" అనింది నరసమ్మ. ఎంత చెప్పినా వినకుండా మొండి జేశారు పిల్లలు.

"చదివి సంతరించినమటుకు చాల్లే! బళ్ళో అయ్యోర్లు చెప్పే పాఠాలు చదువతుంటె మేము చెప్పే పాఠాలు చదివే దెప్పుడూ? కూడు నీళ్లు లేక అంటు డొక్కల్తో ఎన్నాళ్లు చదవతారమ్మా? వీధుల్లో ఉడుకుడుమ్ముల్లో కాళ్లు కాలకముందే పోయి నాలుగు మెతుకులు తాండమ్మా! బక్క పేగుల్తో ఎన్నాళ్ళు బతికేను? ఆకలికి చెవులు కప్పుకోని ఓమ గమ్మతుండది నాయనో. కూన గురుజు విడుస్తుండారు. ఎన్నియుగాలయిందో కడుపార తిని. ఎవురి నోటికాడకూడు తీశామో, ఏం పాపమో దేవుడా!" అని ఏడ్చింది నరసమ్మ.

"అమ్మ ఏడుస్తుందడి—బడికొద్దు ఏం వొద్దు. కవళానికి పోదాం పదండి" అని పుస్తకాలు అక్కడ బెట్టి మూకుళ్లు తీసుకొని వెళ్లారు పిల్లలు. దూరంలో "కవళం వెయ్యండమ్మా" అని కేకలు వినవస్తున్నాయి. నరసమ్మ అవంకే చూస్తూ ఆరిపొయ్యే పెదిమల్ని కన్నీళ్ళతో తడుపుకొంటూ, కడుపులో రేగిన మంటను, ఆ వేదనను నిట్టూర్పులతో విసరుకొంటూంది.

ఒక బిడ్డను అంటజేసుకోని, రాగయ్య పడిపోయిన కాలు చేయి యీడ్చుకొంటూ ఊళ్ళో కవళం తెచ్చుకోని తనపాట్టు తాను పోసుకొంటూ కాలక్షేపం చేస్తున్నాడు.

రాగయ్య కుదరని పక్షవాతంతో, పడిపోయిన పార్శ్వాన్ని, బాగున్న పార్శ్వంతో గుంజుకుంటూ నడవటం నేటి సంఘంలో సంపన్నుడికి, పేదకుగల వ్యత్యాసం, వికారం స్పష్టపరుస్తూంది. అంతేకాదు, తను తోటబిడ్డల్ని ఊళ్ళో కవళానికి తీసికెళ్ళటం చూస్తే ఈ అడుక్కొతినటం తమతరంలోనేగాక తమ బిడ్డల తరంలో గూడ తప్పదని రూఢిచేస్తున్నాడు రాగయ్య.

చదువుకోటానికి వసతులున్న పిల్లలు అయ్యవారు నేర్పిన పాఠాలు పలుకుతూంటే, రాగయ్య బిడ్డల్లాంటి వాళ్లు "కవళం వెయ్యండయ్యా! కడుపులో మంటమ్మా!" అని వీధుల్లో పేగులు తరుక్కొపొయ్యేట్టు అరుస్తున్నారు.

"పిల్లలు బడికి రాలేదేమా" అని అయ్యవారు పిల్చుకోపోటానికి వచ్చాడు.

"ఏం నరసమ్మా! పిల్లలు ఒకపూట బడికొస్తే ఇంకో రోజు రారే" అన్నాడు అయ్యవారు.

"ఈరోజున్నట్టు రేపు ఉంటుందనే నమ్మకం లేక పాయనే అయ్యా! మా బతుకులకు పండగా, పర్వమూ, పుణ్యమా, పురుషార్థమా ఏమీ లేదు. నిద్దర్లేస్తే ఆకలమ్మకు నయివేద్యాలతో పొద్దు చాలడంలా నాయనో! మా కుటుంబానికి గతి ఒకరు దక్క చేసేదిగాదు. కడుపు చించుకొంటె కాళ్ళమీదపడద్ది. ఎండనక, వాననక, తేళ్ళకు పాములకు ఎరవక, పిడికిట్లో ప్రాణాలు పెట్టుకోని, మేఘాలమీద పొయ్యే గొడ్లను మరిపి. కయ్యాలకు కాలవలకు ఒడ్లు మడవలు వేసి, పండించి, కామందుల గోరికమతాల్ని ఇళ్ళు వాకిళ్ళను లంకల్ని జేస్తిమి. కళ్ళు పొడుచుకొన్నా కానరాని కటిక చీకట్లో గొడ్లను మేపితిమి. కలలో అయినా తన మన అనుకున్న దోసాన అన్నపోయి ఎరుగుదుమా నాయనా! ఇట్ట చాకిరి జేస్తే మా బిడ్డలు, దొంగలైన తోడుబోతులైన అనుకోకుండ మా గతులు తెల్లార్చుకోని, కడకు బిచ్చగాళ్లమయితిమి. చచ్చినామా బతికినామా అన్న దోసాన బోయిన కామందు లేకపాయ. ఎన్నాళ్ళు చాకిరి చేస్తే ఏంలాభం నాయనా! కొసకు కామందుల గొడ్లకుండే వైనం మాకు లాకపాయ. వాటికి పెంకు కొట్టాలు. మేము చెట్టకింద కాపురం జెయ్యాల. ఏనాడు కామందుకు కీడు ఎంచినోళ్ళం గాదే! సంపాదించి పెట్టేవాడు మూలబడి మా కర్మం ఇట్ట కావాలా చెప్పు నాయనా." అంటూ నరసమ్మ కన్నీళ్ళు పెట్టుకొనింది.

"పరిస్థితులిట్టుంటె పిల్లలు బడికొచ్చి చదువుకోమంటె ఏ ఒరలో ఈ కత్తులు ఇముడుతాయి చెప్పమ్మా. లోక కళ్యాణం కోరే కవులకన్నా మనమీద దయలేకపాయ. వాళ్ళ కవిత్వాలకు మన కష్టాలు బాధలు చాలక ఇంకా వేలరకం కష్టాల్ని సృష్టించుకోటంలో పొద్దుచాలక శ్రమపడుతున్నారనుకొంటున్నా! పోనీలే. ఇంతకంటె మనం ఇంకేం చెయతాం తల్లీ? మనం ఇట్టుండవే లోకానికి మేలయితే ఇదే పదేలు. మన బాగుకోసం ఒకర్ని బాధపెట్టి మనం బాగుపడేది ఏముంది? చదువుకోని వృద్ధిలోకి రావాల్సిన బిడ్డలు ఒట్టి బిచ్చగాళ్లుగ దేశదిమ్మరులై పొయ్యే గతి పట్టిందే. ఎంత దౌర్భాగ్యం! గర్భవతులు, బాలింతలు పొత్తుల్లో బిడ్డల్ని పెట్టుకోని యాచించటం, రోగులు, కుంటి గుడ్డి అడుక్కొతినటం చూస్తుంటె

ఎంత అవమానంగా ఉంది, రాగయ్యా! ఈ పూట బిడ్డలు బడినుంచివచ్చిన పాట మనఇంట్లో అన్నం తింటార్లే. నే నొస్తా. ఆలస్య మవుతూంది." అంటూ అయ్యవారు వెళ్ళిపోయాడు.

పిల్లల్ని బడికి పంపించాలని ఆశఒకవంక, పంపిస్తే పస్తులుండాల్నే ఏం గతని నిరాశ ఇంకోవంక బాధిస్తున్నాయి. ఏం తోచక దిక్కులు జూస్తు ఆకాశం వంక చూచాడు రాగయ్య. తనమనస్సువలెనే ఆకాశం మేఘావృతమయి, స్తిమితంలేని తనబ్రతుకువలెనే పరిగత్తే మేఘాల ఉరవడి రాపిడిని చూస్తు నిలుచున్నాడు. ఆకాశవీధిలో ప్రకృతి దర్శకత్వంక్రింద తన జీవితమే నాటక మాడిస్తున్నట్టు దృశ్యాలు తెరలు రంగాలు ఒకటివెనుక ఒకటి నడిచి పోతున్నాయనుకొంటూండగా జల్లు ప్రారంభమయింది. ఆ వొంటిమీదవున్న ఆ ఒక్కపాత తడిసిపోతే దిక్కేమి దేముడా అని ఆదలంబాదల యెదురుగా ఉన్న ఎవరిపంచలోకో ప్రవేశిస్తు తన కాళ్ళక్రిందపడి నలిగిన చీముల్ని చూసూ చావు బ్రతుక్కూ బ్రతుకుచావుకూ పెనవేసికొనిఉండిన రహస్యాన్ని గ్రహించక సుఖపడలేదేఅనే ఆశకొద్దీ ఏడ్చిఏడ్చి ఆ కన్నీళ్ళతో ఆ విషవృక్షానికి మసిగలుకట్టి మరింత ఏపు కోపు కలిగించటం తప్ప ఆ పెనుపుండు తీసిన వాడు లేడని నిరుత్సాహంగా పంచలో అడుగు పెట్టాడు. అంతక్రితమే కుక్కలు రెండు తడిసి అక్కడే తలదాచుకొని ఉన్నాయి.

రాగయ్యను చూచి ఒకటి మొరిగింది. ఇంకోటి సమీపించి స్వాగతం ఇచ్చింది. వాన వెలిసిందాక వాటితోటే రాగయ్య తలదాచుకొని కాలక్షేపం చేశాడు. వాన వెలిసింది. ఇంటికి దారిపట్టాడు. దోవలో శంకరయ్య యెదురైనాడు. బాకీవిషయం రాగయ్యతో ప్రస్తావించాడు.

"ఏం రాగయ్యా! బాకీ మందల ఏం జేసినావు? మేము మీకు బాకీఅయినట్టు మీచుట్టూ తిరగాల్సినట్టుండదే. ఇదేంది గాచారం మాకు?" అని మండిపడ్తూ మొహమంతా కళ్ళు చేసుకొన్నాడు. నిమిషాలమీద బాకీ వసూలుగావాలని గొంతుమీద కూర్చున్నాడు.

"అయ్యా నాగతి జూస్తా మీరు తొందరజేస్తే ఏం జేసేది! కాస్త నెమ్మతిస్తే కూలో నాలో జేసి చెల్లుబెడ్తా. మీ ఋణాన పోనులే అయ్యా!" అన్నాడు రాగయ్య.

"ఈ రోగం కుదిర్తేనా నీవు చెల్లుబెట్టేది? వడ్డీవరాలపాడిగ అమ్మతుంటె మీకు ధారాదత్తంజేసి మేవు చేతులు గడుక్కోనేదా? బలే ప్లానే ఇది? నీ ఇంటిస్థలం విక్రయంజేయి. కొంతన్నా చెల్లుపోద్ది. ఇంక నిలపటానికి లా బాకీ" అంటూ వీధిలో రచ్చచేయటానికి మళ్లాడు.

"అయ్యా కాలు చేయి పడిపోయిందాక మీ పాదాల్ని కనిపెట్టుకొని కష్టంచేసినోణ్ని. నన్ని ఇంత పరాయోణ్ణిగజేసి ఈ క్షణం నన్ను ఈడ ఈపస్థంభానికి దీస్తే నేనాడ జచ్చేది చెప్పండి? మీ కుప్ప నూరిచి వడ్లను మేలురాసి చేస్తా మీ కళ్లాంలోనే గదో నాకు ఈ కాలుచేయి పడిపోయింది." అంటూ రాగయ్య పెద్దపెట్టుగా ఏడ్చాడు. రాగయ్య బాకీ ఎగబెట్టాలని నటిస్తున్నట్టు శంకరయ్య అనుకున్నాడేగాని కృతజ్ఞుడు కాలేకపోయాడు. ఇంతలో రాగయ్య కొడుకు వీరయ్య బడినుంచి ఆ దోవనే వచ్చాడు.

"ఏం వీరయ్యా! అప్పుడే వచ్చినావే—బడి వొదిల్నారా?"

"ఆకలవతూంటె అయ్యోర్ని అడిగొచ్చినా!"

"ఇదిగో ఈ మూకుట్లో కూడు రవంత నీవు తిని బడికి పో" అంటూ రాగయ్య పిల్లవాడిచేతికి మూకుడిచ్చాడు. పిల్లవాడు రెండడుగులు నడచాడు.

"ఎవురోయ్ రాగా! ఈ పిల్లగోడు" అని శంకరయ్య అడిగాడు.

"నా కొడుకయ్యా."

"ఈన్ని చదివిస్తుండావంటయ్యా!"

"ఏం చదువులే అయ్యా! మాగోడు అమ్మ అన్నాటికి."

"చేతికి ఎదిగినోణ్ణి సేద్దానికి కొట్టక బడికంపించి వాణ్ని చెరుస్తుండా? ఈణ్ణి మన కమతాన బెడ్తే నీ బాకీలోకి చెల్లేసుకోనూ?"

"ఏనో చదువుకొంటె మేలు కలగద్దని ఆశ! ఇంకే పుండది!"

"ఆశలకేం లేవయ్యా! అనుకొనేకొద్దీ ఆశలకు పురి యెక్కుతుండేదేగదా!"

"ఏం వొద్దులే. నేను చెల్లుబెడ్తాలే. ఇప్పణ్ణుంచే వాడిమీద బాకీలు సాకీలు ఎందుకులే అయ్యా! కాస్త తమాయించండి. ఎట్టనోకట్ట సరిపెడ్తా" అన్నాడు రాగయ్య.

శంకరయ్య రుద్రుడై పోయాడు. "ఎట్ల చెల్లు బెడ్తావోయ్. నీవు కూకున్నచోట్నుంచి కదలేక పోతివి! నీ పెళ్ళాం ఉంటె లేవలేందాయె. కొడుకును కలెక్టరు చెయ్యాలని చదివిస్తుంటివి! ఇంక నీవు సరిపెట్టేదియాడ? నీకు అన్ని పదిలంగా ఉండా॰. మేమా నలిగి చావాల్సింది? వల్లగాదు. పిల్లగోణ్ణి పసులకాడికిపంపంది ఒప్పుకోను. చెప్తుండా!"

రాగయ్యగతి పాముపడగనీడలో కప్ప పరిస్థితి అయింది. ఋణబాధ నివారణ అయితే రోగంకూడ కుదురుతుందని రాగయ్య స్థిరం చేసుకొని,

"వీరయ్యా! శంకరయ్య బర్రెలకాడికి పో అయ్యా" అన్నాడు.

"నేను పోను. చదువుకోవాల పో."

"చదివిన మటుకు చాల్లేవోయ్! మీ వాళ్ళంతా లెస్స చదివినారు గావాల! పస్తులుంటుంట్రా చదివేది పిల్లగోడా? లక్షణంగా మన ఇంటికాడ నీళ్ళు మెతుకులు దాగి లక్షణంగా బర్రెల్ను మేపుకోస్తువురా!" అన్నాడు శంకరయ్య.

"కవళం అన్నా తెచ్చుకొని చదవతా గాని నేనేవో పశాలకాడికి రాను." అంటూ రెండడుగులు నడిచాడు వీరయ్య.

"ఏం వోరే! చెప్తుంటె అంత దిసాయించకుండా పోతుండావే. ఎద్దు కొల్లో ముల్లంత లేవు! ఏవో మిడిసి పడ్తా ఉండావే. ఏవో బలెమిడి దోక్కొని నలగతుండావే! యాడికి నీవు పొయ్యేది! తిరుగు యెనక్కు. ఒళ్ళుగాని తివర్తుండదిగనేం. గూబ అదిరేనోయ్! పద ఇంటికాడికి. బర్రెలు కట్టు ముందర; రొప్పతుండాయి. పొద్దెక్కింది. ఈ యెరకు బాగామేసి నెవులు యేసుకోవాల్సిన గొడ్లు. రా. రా. నీకు మన అబ్బయ్యోళ్ళ పాతచెడ్డీలు చొక్కాలు యిస్తారా. లక్షణంగా తొడుక్కుందువు." అంటూ అదిలించి బెదిరించి లోపర్చుకొన్నాడు శంకరయ్య.

"బడికిపోకపోతే తంతాడు అయ్యోరు" అని వీరయ్య ఏడ్చాడు.

"నీవు మా పశలకాడికొస్తే అయ్యోరు నిన్ను తన్నడానికి ఎన్ని గుండెలున్నాయి? నిన్ను తిన్నిపాట ఇంకాయన యాడ ఉండేది? ఆయన నుంటేది మన పశాలకోటాంలో. ఆయనకు నే చెప్తారా! నడు నడు. కాస్త అడుగుచాచె. బలే మొనెక్కుడుగా ఉండదే! పెళ్ళిపడకలు నడిచేవాడివి నీవేం మేపతావయ్యోవ్ గొడ్లను! లగెత్తు-లగెత్తు. పశలు అగ్గిదాగుండాయి." అంటూ పిల్లవాణ్ణికూడా తీసికెళ్ళాడు.

పిల్లవాడితో ఏదో చెప్పాలని రాగయ్య యోచించాడు. కాని మాట రాలేదు. ఇంతలో వాళ్ళు వెళ్లుతూ దూరమయ్యారు. ఆవంకే చూస్తున్న రాగయ్యకు మనసులో బాధ కలిగింది. వొలిసే కుండాలలా, నేలకొరిగిన మబ్బులా ఉన్నాడు రాగయ్య. మెరపును వాలిన ఉరుములా కాసేపటికి గాని మాటరాలేదు. "అయ్యా! వీరయ్యా! చేసేపనిమీద నిష్ఠ పెట్టుకో అయ్యా! పాలు మాలబాక. గొడ్లు నోరులేనివి. వాటి కడుపులో నిద్ర బోవాల. నీ యిష్టం!" అంటూ తన సంప్రదాయం, ధర్మం వీరయ్యకు బోధించాడు.

పాపం ఎండదెబ్బ కొట్టిందేమో రాగయ్యకు, కళ్ళుతిరిగి కూలబడ్డాడు. భూదేవత కనికరించి దగ్గర తీసింది.

ఇంతలో సర్వోదయ కార్యకర్తలు, భూదానోద్యమాది ధర్మకార్యాసక్తులు, గాంధేయతత్వవిదులు, గ్రామపంచాయతీ సభ్యులు - అందరూకలిసి "గ్రామోద్ధరణ కావాలి" అని నినాదాలుజేస్తూ పర్యటిస్తూ ఆ గ్రామం గమిలిలోకి వచ్చారు. "అంతా నిజమే లే" అన్నట్టు ఊళ్ళో కుక్కలు ఒకే మొరగటం ఆరంభించాయి. సందాల మీటింగు అందరూ రావాలని పంచాయతీ ప్రసిడెంటు ప్రకటన చేశారు.

"మనకంటె మనల్ను బాగుచెయ్యాలని వొచ్చినోళ్ళు పూరాగా ఉండారే. ఇదేందిరా నాయనోవ్!" అని గ్రామస్థుల్లో గుసగుసలు బయలుదేరాయి.

ఇంతలో రాగయ్యభార్య నరసమ్మ నీళ్ళకని పోయి పంచాయతీవారి బావిదెందసె కూలి అంగులో పడి పూడిపోయిందని గ్రామస్థులందరు ఏడుస్తూ అక్కడ మూగారు. "ముత్తయిదుచావు; నరసమ్మ పుణ్యం." అంటూ గ్రామస్థులు తృప్తిపడ్డారు.

దేముళ్లతో మొరపెట్టుకొందామని పోతే వారంతా సినిమాలో వేషాలువేస్తూ వీరి మాటే పట్టించుకోలేదు.